మద్యం విక్రయిస్తే చర్యలు

- మెంగారం గ్రామంలో తీర్మానం



నవతెలంగాణ-లింగంపేట్

మద్యం విక్రయాలు నిషేధిస్తూ మండలంలోని మెంగారం గ్రామస్తులు తీర్మానం చేసుకున్నారు. మంగళవారం గ్రామ పెద్దలు, కులపెద్దలు సమావేశమై తీర్మానించుకున్నారు. ఈనెల 19 నుంచి గ్రామంలో మద్యం విక్రయించరాదని తేల్చి చెప్పారు. మద్యం విక్రయించినట్లయితే విక్రయించిన వారికి 20 వేల రూపాయల జరిమానా విధించనున్నట్టు తెలిపారు. సమాచారం అందించిన వారికి వెయ్యి రూపాయలు నగదు అందిస్తామన్నారు.

ముగిసిన పది పరీక్షలు

నవతెలంగాణ-కంఠేశ్వర్



పదో తరగతి పరీక్షలు మంగళవారంతో ముగిసాయి. దీంతో విద్యార్థులు ఇంటి బాట పట్టారు. కాగా చివరి సోషల్ పరీక్షకు 62 మంది గైర్హాజరైనట్టు డీఈవో తెలిపారు. మొత్తం 138 కేంద్రాల్లో 21,551 మంది విద్యార్థులకు గాను 21,489 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైయ్యారు.



డ్రోన్‌తో పిచికారిపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

డ్రోన్‌తో సమయం, డబ్బు ఆదా

- ఎరువులు, పురుగుల మందు పిచికారిపై రైతులకు వివరించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు

నవతెలంగాణ-సదాశివనగర్

డ్రోన్ సాయంతో ఎరువులు, పురుగుల మందు పిచికారి చేయించుకుంటే సమయంతో పాటు డబ్బు ఆదా అవుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలో భారతీయ వరి పరిశోధన స్థానం-రాజేంద్రనగర్ హైదరాబాద్, అడ్లూర్ ఎల్లారెడ్డి సొసైటీ ఆధ్వర్యంలో సేవా స్ఫూర్తి ఫౌండేషన్ వారి సౌజన్యంతో కృషి విజ్ఞాన్ కేంద్రం-రుద్రూర్ సమన్వయంతో డ్రోన్ ద్వారా వరిలో పురుగు మందులు, ఎరువుల పిచికారిపై అవగాహన కల్పించారు. సుమారు 50 ఎకరాల్లో రైతుల పొలాలకు ఉచితంగా పురుగు, తెగుళ్ల మందులు ఇచ్చి డ్రోన్‌తో పిచికారి చేయించారు. వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయం చేయడం ద్వారా సరైన సమయంలో సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టడం వలన సమయం ఆదా చేయడంతో పాటు ఎక్కువ విస్తీర్ణంలో పంటల ను కాపాడి మంచి దిగుబడి పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. 'ఎకరా పొలానికి 5నుంచి 6 నిమిషాల్లో స్ప్రేయింగ్ పూర్తవుతుంది. మామూలు స్ప్రేయర్లతో గంట నుంచి 2 గంటల సమయం పడుతుంది. పంటకు తెగులు వచ్చినప్పుడు ప్రాథమిక దశలోనే పిచికారీ చేయాల్సి ఉంటుంది. అలాంటి సమయంలో కూలీలు దొరక్క పిచికారీ ఆలస్యమైతే పంట పాడైపోయేది. డ్రోన్లు వచ్చాక ఆ ఇబ్బంది తప్పింది. పురుగుమందులూ ఆదా చేయవచ్చు. పురుగు మందులు పిచికారీతో రైతులకు ఎదురయ్యే ఆరోగ్య సమస్యలు కూడా తప్పాయి, డ్రోన్ క్లిక్ చేసిన ఫోటోలు లేదా చిత్రాలను ప్రత్యేకంగా రూపొందించిన సాఫ్ట్‌వేర్ ద్వారా మరింత విశ్లేషిస్తాం. తెగుళ్ళ, వ్యాధుల తీవ్రతకు సంబంధించిన సమాచారం ఇందులో పొందవచ్చు. డ్రోన్ టెక్నాలజీ సహాయంతో తెగుళ్ళు, వ్యాధులపై ముందస్తు అంచనా వేయవచ్చు. డ్రోన్ల సహాయంతో పంట మీద ఏ ఎత్తులోనైనా మందులను చల్లవచ్చు' తెలిపారు.

వరి లాంటి పంటల్లో డ్రోన్ ద్వారా పిచికారీ చేయడం చాలా సులభం, తక్కువ నీటిని వినియోగించి తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పిచికారీ చేసే అవకాశం వుందని భారతీయ వరి పరిశోధన స్థానం రాజేంద్రనగర్ హైదరాబాద్ టెక్నికల్ ఆఫీసర్ టి.వెంకయ్య ఎంటమాలజీ, కృషి విజ్ఞాన కేంద్రం రుద్రురు సీనియర్ శాస్త్రవేత్త డా. నవీన్ కుమార్ వివరించారు. ఈ కార్యక్రమంలో సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ గొల్లపెల్లి రత్నాకర్, చైర్మన్ సదాశివరెడ్డి గారు, శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ రైతులు మహేష్, భాస్కర్, పెంటయ్య, రాజు, బాలయ్య, పోషయ్య పాల్గొన్నారు.

అడ్వెంచర్ క్యాంప్‌లో భిక్కనూర్ విద్యార్థి ప్రతిభ

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండలంలోని భిక్కనూరు గ్రామానికి చెందిన బోనగిరి అరుణ్ కుమార్ అనే విద్యార్థి తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ రవీందర్ గుప్తా చేతుల మీదుగా ఎన్ఎస్ఎస్ నేషనల్ అడ్వెంచర్ క్యాంప్ సర్టిఫికెట్‌ను మంగళవారం అందుకున్నారు. అరుణ్ కామారెడ్డిలోని ఆర్కే డిగ్రీ కళాశాలలో బీఏ థర్డ్ ఇయర్ విద్యనభ్యసిస్తున్నారు. గత రెండు నెలల క్రితం హిమాచల్‌ప్రదేశ్‌లోని కులుమనాలిలో ఎన్ఎస్ఎస్ నేషనల్ అడ్వెంచర్ క్యాంపునకు హాజరయ్యాడు. దానికి సంబంధించిన సర్టిఫికెట్‌ను వైస్ ఛాన్సలర్ చేతుల మీదుగా అందుకున్నాడు. దీంతో ఆర్కే డిగ్రీ కళాశాల యాజమాన్యంతో పాటు, పలువురు గ్రామస్తులు అరుణ్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ తెలంగాణ యూనివర్సిటీ కోఆర్డినేటర్ రవీందర్‌రెడ్డి, తెలంగాణ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ స్రవంతి పాల్గొన్నారు.



విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేస్తున్న టీయూ వీసీ

మండుటెండలో ఉపాధి



- కానరాని ఓఆర్ఎస్ ప్యాకెట్‌లు, మెడికల్ కిట్
- పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కరువు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న కూలీలు

నవతెలంగాణ-బోధన్/లింగంపేట్

ఉపాధి హామీ కూలీలు పనిచేసే చోట సౌకర్యాలు కల్పిస్తున్నామని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం ఎలాంటి సౌకర్యాలు కనబడడం లేదు. ప్రస్తుతం ఉపాధి పనులు జోరందుకుంటుండగా.. ఎండ తీవ్రత సైతం తీవ్రంగా పెరిగింది. 40 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు పైగానే ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పని ప్రదేశంలో సేద తీరేందుకు టెంట్‌లు, మంచినీళ్ల సౌకర్యం కల్పించాల్సి ఉన్నా.. ఎక్కడా అమలు కావడం లేదు. పనిప్రదేశంలో హెల్త్ కిట్ అందుబాటులో ఉంచాల్సి ఉన్నా పట్టించుకునే నాథుడే కరువు. ఇంటి నుంచి మంచినీళ్లు తెచ్చుకుంటున్న వారికి అదనంగా డబ్బులు చెల్లించాల్సి ఉన్నప్పటికీ పై విషయాలేవీ కూలీలకు తెలియకపోవడం గమనార్హం. ఇరు జిల్లాల్లో పలు చోట్ల క్షేత్రస్థాయిలో నవతెలంగాణ పరిశీలించగా ఉపాధి కూలీలు తమ సమస్యలను ఏకరవు పెట్టారు.

నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 530 గ్రామపంచాయతీగాకు గాను 2,77,599 జాబ్ కార్డులు ఉండగా, 5,62,973 కూలీలు నమోదు ఉన్నారు. 1,28,476 కుటుంబాలలో 1,90,294 మంది కూలీలు పని చేస్తున్నారు. ఇక కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 526 పంచాయతీల్లో 2.60 లక్షల జాబ్ కార్డులకు గాను 5.80 లక్షల మంది కూలీలు నమోదు చేసుకునొ ఉన్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 40 వేల మంది కూలీలు పనులు చేపడుతున్నారు.

నిజామాబాద్ జిల్లా బోధన్ మండలంలోని చిన్నమావంది శివారులో ఉపాధి పనులు కొనసాగుతుండగా.. కూలీలుకు నీడ సౌకర్యం లేదు. అలసిపోయి సేదదీరేందుకు నీడ లేక ఎండలోనే కూర్చోవాల్సిన దుస్థితి నెలకొంది. అవకాశం ఉన్న చోట చెట్లు, ముళ్లపొదలను ఆశ్రయిస్తున్నారు. కూలీలు పనిచేస్తున్న సమయంలో మస్టర్‌పై వారి హాజరు తీసుకోవాల్సి ఉండగా.. నోట్‌బుక్‌లో పేర్లు రాసుకుంటున్నారని, దీంతో తమ వివరాలు సరిగ్గా నమోదు కాక కూలీ సక్రమంగా రావడం లేదని కూలీలు వాపోతున్నారు.

అదే విధంగా కామారెడ్డి జిల్లా లింగంపేట్ మండలంలోని పర్మళ్లతో పాటు పలు గ్రామాల్లో పరిశీలించగా.. కూలీలకు ఎక్కడా సౌకర్యాలు కల్పించిన దాఖలాలు లేవు. తాగునీరు లేక కిలోమీటర్‌ల దూరం నడుచుకుంటూ వెళ్లి బోరుబావులను ఆశ్రయించాల్సి వస్తోందని వాపోతున్నారు.

ఎలాంటి సౌకర్యాలూ లేవు..

ఉపాధి హామీ కూలీలు పనిచేస్తున్న చోట గాయాలయితే ప్రాథమిక వైద్యం కోసం మెడికల్ కిట్, నీడ కోసం టెంటు లాంటిది ప్రభుత్వం గతంలోనే ప్రతి గ్రామానికి మంజూరు చేసింది. కానీ ప్రస్తుతం ఎక్కడ కూడా పనిచేసే చోట మెడికల్ కిట్ గాని నీడ కోసం టెంట్ గాని లేవు. దాంతో ఉపాధి హామీ కూలీలు ఇబ్బందులు పడుతూ చెట్టు నీడను ఆశ్రయిస్తున్నారు. ప్రమాదవశాత్తు దెబ్బలు తగిలిన, వడదెబ్బతో ఇబ్బందులు పడిన కనీసం ఓఆర్ఎస్ ప్యాకెట్లు కూడా కూలీల సమీపంలో లేవు. ఎవరికి వారే బాటిళ్లలో తాగు నీటిని తెచ్చుకుంటున్న వాటికి డబ్బులు చెల్లించే విషయం తమకు తెల్వదని కూలీలు పేర్కోనడం గమనార్హం. ఉపాధి కూలీలు పనిచేస్తున్న సమయంలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడం ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.



బోధన్ మండలం చిన్నమావందిలో ఎండలోనే సేద దీరుతున్న కూలీలు

ఈ విషయమై బోధన్ ఏపీవో హేమలతను వివరణ కోరగా గతంలో వచ్చిన టెంట్లు మాత్రమే ఉన్నాయని, ప్రాథమిక వైద్యం కోసం పంచాయతీ నుంచి మెడికల్ కిట్ ఏర్పాటుచేయాలని సూచించారు. ఎంఐఎస్ ట్యాంక్ పనులు జరిగినప్పుడు టెంట్లు ఏర్పాటుచేస్తామని ప్రస్తుతం కెనాల్ పనులు జరుగుతున్నాయని అక్కడ టెంటు వేయడం సాధ్యం కాదు కనుక వేయలేదని సమాధానమివ్వడం గమనార్హం. మండల అధికారులు ఇప్పటికైన క్షేత్ర స్థాయిలో పరిశీలించి కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని కూలీలు డిమాండ్ చేస్తున్నారు.

నీలువ నీడ కరువు

పని ప్రదేశంలో నీరు లేక కూలీలు వ్యవసాయ బోర్లను వెతుక్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. పనిచేసే చోట కూలీలకు గుడారాలు, టెంట్లు, తాగునీటి సౌకర్యం మెడికల్ కిట్లు అయోడిన్ బాటిల్ ఓఆర్ఎస్ ప్యాకెట్ ఇతర ఇతర మందులు అందుబాటులో ఉంచాలి. ఇప్పటివరకు పని జరిగే ప్రదేశాల్లో అవి కనిపించిన దాఖలాలు లేవు. కూలీలు వేసవిలో డిహైడ్రేషన్ గురవుతున్నారు. నీడ కోసం సమీపంలోని చెట్ల వద్దకు వెళ్లి సేద తీర్చుకుంటున్నారు. అదేవిధంగా తాగునీరు లేక సమీపంలో వ్యవసాయ బోర్ల వద్దకు వెళుతున్నారు. దప్పిక తీర్చుకుంటున్నారు కొంతమంది కూలీలు ఇంటి నుండి వాటర్ బాటిల్లు తీసుకె ళ్తున్నారు ప్రస్తుతం జిల్లాలో 38 శాతం ఉంది రోజురోజు ఉష్ణోగ్రత తీవ్రం కావడంతో కూలీలకు వడదెబ్బ తలిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

చేతులకు బుగ్గలు వస్తున్నాయి

శ్రీనివాస్. శెట్టిపల్లి సంగారెడ్డి



ఎండకు భూమి దంగక చేతులకు బుగ్గలు వస్తున్నాయి. గడ్డపార పట్టుకుంటే చేతులు భగభగ మండుతున్నాయి. బుగ్గల వచ్చి జ్వరం రావడంతో చేతులు మండుతున్నాయన్నారు. ప్రాణం సుస్తయితోంది.

ఉపాధికి బడ్జెట్ పెంచాలి

పెద్ది వెంకట్‌రాములు.

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి

కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌కు నిధులు తగ్గించడంతో పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించలేకపో తున్నారు. గతేడాది రూ.93 వేల కోట్లు కేటాయించగా.. ఈసారి 73 వేల కోట్ల రూపాయలు కేటాయించిందని అందులో 21 వేల కోట్ల రూపాయలు పెండింగ్ బిల్లులు ఉన్నాయి. అంటే ఈసారి కేవలం 52 కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించినట్టు లెక్క. దీంతో కూలీలకు అనేక సౌకర్యాలు దూరమవుతున్నాయి. పనిచేసే ప్రాంతంలో చిన్న పిల్లలు ఆడించడానికి ఆయమ్మలు, నీటి సౌకర్యానికి అదనంగా అయిదు రూపాయలు మంజూలు చేయాలి. మెడికల్ కిట్టు ఏర్పాటు చేయాలి. పనిముట్లు ఇవ్వాలని, పనిముట్లు పదును చేసుకోవడానికి 5 రూపాయల చొప్పున నిధులు కేటాయించాలి. మేట్ల వ్యవస్థను నిర్వీర్యం చేయకుండా కొనసాగించాలి.

బీఆర్ఎస్‌కు బ్రహ్మరథం పడుతున్న మహారాష్ట్ర ప్రజలు

- జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ షిండే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే షిండే

నవతెలంగాణ-మద్నూర్

తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను చూసి బీఆర్ఎస్ పార్టీకి మహారాష్ట్ర ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ షిండే అన్నారు. మంగళవారం మండలంలోని లచ్చన్ గ్రామంలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ప్రతి ఇంటికీ చేరుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షులు బస్నీ పటేల్, లచ్చన్ ఎంపీటీసీ సభ్యురాలు, ఎంపీపీ వాగ్మారే లక్ష్మీబాయి, జడ్పీటీసీ సభ్యురాలు అనిత కథలయ్య, సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు సురేష్, మద్నూర్ సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ పటేల్, మాజీ జెడ్పీటీసీ బసవరాజ్ పటేల్, సీనియర్ నాయకులు మొయినుద్దీన్, పండిత్ రావు పటేల్, కాశీనాథ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

వివాహేతర బంధానికి అడ్డుగా ఉందని చిన్నారి హత్య

నవతెలంగాణ-బోధన్

వివాహేతర బంధానికి అడ్డుగా ఉందని చిన్నారిని హత్యచేశారో జంట. ఈ ఘటన బోధన్ మండలం కల్దుర్కిలో మంగళవారం తెల్లవారు జామున చోటు చేసుకోగా.. పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి వివరాలు వెల్లడించారు. ఏసీపీ కిరణ్‌కుమార్ వివరాల ప్రకారం.. కల్దుర్కి గ్రామానికి చెందిన దేవుళ్ల లక్ష్మణ్(27)అనే యువకుడు గతంలో మేస్త్రీ పనికోసం ఆర్మూర్, మోర్తాడ్ ప్రాంతానికి వెళ్లగా.. అక్కడ నిర్మల్‌కు చెందిన చెంచు రాధతో పరిచయం వివాహేతర బంధానికి దారి తీసింది. రాధకు ఇది వరకే అమ్ములు(3) కూతురు ఉండగా ఇరువురినీ తీసుకొని కల్దుర్కికి వచ్చాడు. కాగా వివాహేతర బంధానికి అడ్డుగా వస్తున్న అమ్ములును మంగళవారం తెల్లవారు జామున 4 గంటల సమయంలో హత్య చేసి సమీప చెరువులో పడేశాడు. ఇందుకు చిన్నారి తల్లి సైతం సహకరించినట్టు పోలీసులు తెలిపారు. నిందితుడు మళ్లీ ఉదయం 6 గంటల ప్రాంతంలో చెరువు వద్దకు వెళ్లి చిన్నారి మృతదేహం తీసి తుమ్మ చెట్ల వద్ద పడేశాడు. స్థానికులు గమనించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఇరువురిని అరెస్ట్ చేశారు. విలేకరుల సమావేశంలో సీఐ శ్రీనివాసరాజ్, ఎస్సై సందీప్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతో సమానత్వం

- 180 ఏండ్ల క్రితమే గుర్తించిన మహనీయుడు మహాత్మా జ్యోతిబా పూలే
- జయంతి వేడుకల్లో నివాళి అర్పించిన ప్రజాప్రతినిధులు అధికారులు
- బహుజనుల, మహిళల విద్య కోసం విశేష కృషి చేశారని వెల్లడి



మహాత్మ జ్యోతిబా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

నవతెలంగాణ-కంఠేశ్వర్/నిజామాబాద్‌సిటీ

'దాదాపు 180 సంవత్సరాల క్రితం అనేక ఆంక్షలతో కూడిన నాటి సమాజంలో నెలకొని ఉన్న రుగ్మతలను పారద్రోలేందుకు జ్యోతిబాపూలే చేసిన కృషి అనన్య సామాన్యమైనది. అనేక అవరోధాలు, అవమానాలు ఎదురైనప్పటికీ ఏమాత్రం వెరువకుండా పూలే నాటి సాంఘిక దురాచారాలను తుదముట్టించేందుకు ఎంతగానో శ్రమించారు. ముఖ్యంగా అణగారిన వర్గాలు, శూద్రులు సమానత్వం సాధించాలంటే విద్య ఎంతో అవసరమని గుర్తించి వారికి విద్య అందేలా తీవ్రంగా కృషి చేశారని, మహిళల విద్య కోసం ప్రత్యేకంగా మొట్టమొదటి పాఠశాలను స్థాపింపజేశారని' పలువురు అన్నారు.

జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో న్యూ అంబేద్కర్ భవన్‌లో మంగళవారం మహాత్మ జ్యోతిబాపూలే 197వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఉత్సవాలకు అర్బన్ శాసనసభ్యులు బిగాల గణేష్ గుప్తా అధ్యక్షత వహించగా, జెడ్పి చైర్మన్ దాదన్నగారి విట్టల్ రావు, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, నగర మేయర్ దండు నీతూకిరణ్, రాష్ట్ర మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్పర్సన్ ఆకుల లలిత, మహిళా కమిషన్ సభ్యులు సూదం లక్ష్మి, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, బీసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతిప్రజ్వ లనతో కార్యక్ర మాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మహాత్మ జ్యోతిబాపూలే ఆలోచనలకు ప్రభావితమైన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పూలేను తన గురువుగా ప్రకటించారని తెలిపారు. ప్రత్యేక రాష్ట్రంలో తెలంగాణ ప్రభుత్వం అన్ని వర్గాల వారి సంక్షేమం కోసం పాటుపడుతోందన్నారు. గురుకులాలకు జ్యోతిబాపూలే పాఠశాలలుగా నామకరణం చేస్తూ నాణ్యమైన భోజనం, వసతి సదుపాయాలు కల్పిస్తోందన్నారు. ఒక్కో విద్యార్థి పై ఏటా రూ. 1,25,000 లను ప్రభుత్వం ఖర్చు చేస్తూ కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా బోధనను అందిస్తోందని అన్నారు. బీసీ సంఘాల విజ్ఞప్తి మేరకు నగరంలో బీసీ స్టడీ సర్కిల్, బీసీ కోచింగ్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఎమ్మెల్యే బిగాల హామీ ఇచ్చారు.

జెడ్పి చైర్మన్ విఠల్‌రావు మాట్లాడుతూ.. పూలే వంటి మహనీయులు చూపిన బాటలో పయనిస్తూ వారి ఆశయాల సాధన కోసం కృషి చేసినప్పుడే మన జీవితానికి కూడా సార్థకత చేకూరుతుందన్నారు. సత్యశోధక్ సమాజ్‌ను స్థాపించి దురాచారాలను రూపుమాపారని గుర్తు చేశారు. పూలే ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో వివిధ వర్గాల వారికి నాణ్యమైన విద్యను అందించేందుకు విరివిగా రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ, సమాజంలోని చెడును అంతమొందించేందుకు, సామాజిక రుగ్మతలను, దురాచారాలను పారద్రోలేందుకు అవిశ్రాంతంగా కృషి చేసిన మహనీయుడు జ్యోతిబా పూలే అని కొనియాడారు. ఆయన చూపిన బాటలో పయనిస్తూ, పూలే ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలని పిలుపునిచ్చారు. అనేక ఆంక్షలతో కూడిన నాటి సమాజంలో అణగారిన వర్గాలకు తగిన గౌరవం దక్కాలంటే విద్యతోనే సాధ్యం అని గుర్తించిన పూలే, విద్యను నేర్చుకోవాల్సిన ఆవశ్యకత గురించి నొక్కి చెప్పారన్నారు.

ప్రత్యేకించి బాలికల విద్య కోసం పాఠశాలలు నెలకొల్పి ప్రత్యేక కృషి కొనసాగించారని అన్నారు. అంతకుముందు వినాయక్ నగర్ హనుమాన్ జంక్షన్ వద్ద గల మహాత్మా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి నర్సయ్య, మెప్మా పీడీ రాములు, బీసీ సంఘాల బాధ్యులు బుస్స ఆంజనేయులు, నరాల సుధాకర్, శ్రీనివాస్ గౌడ్, యెండల ప్రదీప్, మాడవేడి వినోద్ కుమార్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే



నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండల కేంద్రంలోని పెద్ద మసీదులో మంగళవారం రాత్రి ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే జాజాల సురేందర్ పాల్గొన్నారు. మజీద్ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువతో సన్మానించారు. మసీదులో జరిగిన ప్రత్యేక ప్రార్థనలు మైనార్టీ సోదరులతో ఆయన పాల్గొన్నారు. పవిత్రమైన రంజాన్ మాసం ముస్లింలకు ఎంతో విలువైనది అన్నారు. ఈ కార్యక్రమంలో మజీద్ కమిటీ అధ్యక్షులు ఫారుక్, జడ్పీటిసి సభ్యులు ఏలేటి శ్రీలత సంతోష్ రెడ్డి, ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఒంటరి సిద్ధారెడ్డి , ఎంపీపీ గరీబునీనసా నయీం, మదర్సా నిర్వాహకులు అబుల్ హసన్ రిజ్వీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఫతియోద్దీన్, మైనార్టీ మండల అధ్యక్షుడు యూసఫ్ ఖాన్, మాజీ సర్పంచ్ అబ్దుల్ ఖదీర్, నాయకులు ఏదుల్ జమీల్ జావేద్, నజీర్ సర్దార్ ఖాన్, లింగంపేట్ సింగిల్ విండో చైర్మన్ దేవేందర్ రెడ్డి, ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నరహరి, మాజీ ఎంపీపీ ముధం సాయిలు తదితరులు పాల్గొన్నారు.

బడిలో స్వయం పాలన



విద్యార్థులతో ఉపాధ్యాయులు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని ప్రాథమిక పాఠశాల కోమటిపల్లిలో స్వయంపాలన దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేందర్ తెలిపారు. పై తరగతికి చెందిన విద్యార్థులు ఒకరోజు ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజేందర్, ఉపాధ్యాయులు లక్ష్మణరావు, ఎస్ఎంసీ చైర్మన్ లక్ష్మీనరసింహులు పాల్గొన్నారు.

పంచాయతీ వర్కర్ల సమస్యలపై కమిషనర్‌కు వినతి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

గ్రామ పంచాయతీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని, జీవో నెంబర్ 60 ని అమలు చేయాలని, గ్రామపంచాయతీ వర్కర్లను పర్మినెంట్ చేయాలని, పిఎఫ్, ఈ ఎస్ ఐ, పిఆర్‌సి అమలు చేయాలని, నిరుపేదలైన గ్రామపంచాయతీ వర్కర్లకు డబల్ బెడ్ రూమ్ ఇవ్వాలని కోరుతూ గ్రామ పంచాయతీ వర్కర్ల జేఏసీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని కమిషనర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి. అనంతరం కమిషనర్ కి వినతిపత్రం అందించినట్టు పంచాయతీ వర్కర్ల నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు సుంకర శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఐ ఎఫ్ టి యు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జటంగి వెంకన్న, అధ్యక్షుడు దాసు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు, సామెల్, ఖాజా మోహినుద్దిన్, గంగాధర్, కార్మిక సంఘాల జేఏసీ నాయకులు, గ్రామపంచాయతీ వర్కర్లు పాల్గొన్నారు.

ముగిసిన పదవ తరగతి పరీక్షలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



మండలంలో 10వ తరగతి పరీక్షలు విజయవంతంగా ముగిసినట్లు మండల విద్యాధికారి ఆంద్రయ్య తెలిపారు. మండలంలోని అన్ని పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మొత్తం పరీక్షలు విజయవంతంగా ముగియడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. మంగళవారం చివరి పరీక్ష పూర్తవ్వగానే పరీక్ష కేంద్రాల నుండి బయటకు వచ్చిన విద్యార్థులు ఆనందంతో కేకలు, కేరింతలతో సందడి చేశారు.

సమసమాజ నిర్మాణమే ఫూలేకు నివాళి

- జ్యోతిబాపూలే జయంతి వేడుకల్లో పలువురు
- జిల్లా వ్యాప్తంగా ఘనంగా జయంతి

సామాజిక విద్య విప్లవకారుడు మహాత్మ జ్యోతి బాపులే జయంతి వేడుకలను మంగళవారం నిజామాబాద్ జిల్లాలో వివిధ పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఫూలే చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.

నవతెలంగాణ-విలేకరులు

కంఠేశ్వర్ : వివక్ష, అంటరానితనం లేని సమాజ నిర్మాణమే జ్యోతిరావు పూలేకి అసలైన నివాళి అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు అన్నారు. మంగళవారం జ్యోతిరావు పూలే 196వ జయంతి సందర్భంగా నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ.. భారతదేశంలో కుల సమాజ వ్యవస్థ మూలంగా చాతుర్వర్ణ సిద్ధాంతం ప్రకారం అనగారిన వర్గాలపైన వివక్ష, అంటరానితనం, దోపిడి, అణిచివేత కొనసాగుతున్న కాలంలో తనజీవితంలో ఎదుర్కొన్న అనేక సంఘటనలను దృష్టిలో ఉంచుకొని మనుషులంతా సమానంగా జీవించగలిగినప్పుడే అవి నిర్మూలించబడతాయని అందుకొరకు అనగారిన వర్గాలు ఐక్యంగా పోరాడి ఎదిరించాలని జ్యోతిరావు పూలే చివరివరకు పోరాడారన్నారు. నాటి సమాజంలో మహిళల పట్ల చులకన భావం, రెండవ శ్రేణి పౌరులుగా గుర్తించే విధానానికి వ్యతిరేకంగా మహిళా హక్కులకోసం కృషి చేశారని వారన్నారు. నేటి పాలకవర్గం మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేయడానికి, దానికనుగుణంగా కుల వ్యవస్థ, అణిచివేత, వివక్షతను కొనసాగించే ధోరణిలో ముందుకు పోతుందని తెలిపారు. మన ధర్మ శాస్త్రాన్ని వ్యతిరేకించే ప్రతి ఒక్కరూ కేంద్ర బిజెపి ప్రభుత్వం అనుసరించే విధానాలను తిప్పి కొట్టి సమసమాజ నిర్మాణంకోసం ఐక్యంగా పోరాడినప్పుడే జ్యోతిరావు పూలే ఆశయాలు నెరవేరుతాయని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నూర్జహాన్, సబ్బని లత, ఎం. గోవర్ధన్, నగర కమిటీ సభ్యులు దేరంగుల కృష్ణ, కటారి రాములు, తదితరులు పాల్గొన్నారు.



కంఠేశ్వర్: మహాత్మా జ్యోతిబాపూలేకు నివాళ్లు అర్పిస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

కంఠేశ్వర్:సామాజిక విప్లవ కారులు, సంఘ సంస్కర్త, బడుగులకు విద్య ప్రదాత, బీసీల జాతి పిత మహాత్మ జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా హనుమాన్ జంక్షన్, వినాయక్ నగర్ వద్ద గల పూలే విగ్రహానికి బీసీ సంఘం నాయకులు పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు సుధాకర్ మాట్లాడుతూ మహాత్మ జ్యోతిబా పూలే అగ్రవర్ణాల పేదలకు, వితంతువులు, ఎస్సీ ఎస్టీ బిసి ఇలా ప్రతి జాతి, ప్రతి కులం వారికోసం పోరాడిన ఏకైక వ్యక్తి అని గుర్తు చేశారు. తన భార్యకు విద్యను నేర్పి తన భార్యను భారత దేశ ప్రథమ ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్దిన గొప్ప దార్శనికుడు మహాత్మ జ్యోతిబాపూలే అని అన్నారు. కార్యక్రమంలో నరాల సుధాకర్, బుస్స ఆంజనేయులు, మాడవేడి వినోద్ కుమార్, పోల్కం గంగాకిషన్, దర్శనం దేవేందర్, కొయ్యాడ శంకర్, ఎండల ప్రదీప్, శ్రీనివాస్ గౌడ్, హన్మంత్ రావు, చంద్రకాంత్, అనిల్, గోపాల్, గోపి, కొట్టూర్ నర్సింహులు, బాలన్న, కోడూరు పొశెట్టి పాల్గొన్నారు.

కంఠేశ్వర్:జ్యోతిబాపూలే దంపతులకు భారతరత్న అవార్డును ప్రకటించాలని, జిల్లాలో పులే దంపతుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని బీసీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు మాడవేడి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. హనుమాన్ జంక్షన్‌లో జ్యోతిబాపూలే విగ్రహానికి బీసీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కంఠేశ్వర్: ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్ అలుక కిషన్ అధ్యక్షతన టీఎన్జీవో జిల్లా కార్యాలయం జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో టిఎన్జీవో జిల్లా కార్యదర్శి సంఘం అమృత్ కుమార్ జిల్లా కార్యవర్గ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



జక్రాన్‌పల్లి : తొర్లికొండలో..

జక్రాన్‌పల్లి:మండలంలోని తొర్లికొండ గ్రామపంచాయతీ అవరణలో జ్యోతి బాపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ సురేష్, ఎంపిటిసి పద్మ, ఉప సర్పంచ్ భూమేశ్వర్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కనక ప్రమోద్, యువజన సంఘాలు , వి డి సి అధ్యక్షులు, సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఏర్గట్లలో..

ఏర్గట్ల: ఏర్గట్ల గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా జ్యోతిరావు పూలే జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గుల్లే లావణ్య గంగాధర్ మాట్లాడుతూ...సత్యశోధక్ సమాజ్ అనే సంస్థను స్థాపించి నిమ్నవర్గాల కోసం, మనువాదంపై పోరాటం చేసిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని ఆమె కొనియాడారు. కార్యక్రమంలో విద్యార్థులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్మూర్ : నివాళ్లు అర్పిస్తున్న ఎంపీపీ, అధికారులు

ముప్కాల్:ముప్కాల్ గ్రామపంచాయతీ కార్యాలయంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. మండల కేంద్రంతో పాటు వేంపల్లి, నాగంపేట్, రెంజర్ల, వెంచిర్యాల, నల్లూర్ గ్రామాల్లో పూలే జయంతి వేడుకలు ఘనంగా చేపట్టారు. కార్యక్రమంలో ముప్కాల్ సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్, పంచాయతీ సెక్రటరీ విజయ్ కుమార్, ఆరోగ్య శాఖ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్:పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన పూలే జయంతి కార్యక్రమంలో ఎంపీపీ పస్కా నరసయ్య పూల మాల వేసి నివాళులు అర్పించినారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరాలు పోవలన్న దురాచారాలు దూరం కావాలన్న ఒకే ఒక ఆయుధం విద్య అని గుర్తించి పాఠశాలలు పెట్టి విద్యను అందించడం జరిగిందని అన్నారు.. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఏపీవో సురేష్ మండల పరిషత్ కార్యాలయ సూప రింటెండెంట్ లక్ష్మి, మంచిర్యాల సురేఖ, ఇంద్రసేన రెడ్డి, దివ్య, స్రవంతి భారతి, యోగేష్, పంచా యతీరాజ్ సిబ్బంది, సిపిఎం కార్యా లయంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు కుతాడి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



నిజామాబాద్‌సిటీ : నివాళ్లు అర్పిస్తున్న సీపీఐ నాయకులు



కమ్మర్‌పల్లిలో...

నిజామాబాద్‌సిటీ: మహనీయులు కలలుకన్న సమసమాజం కోసం ప్రజలు చైతన్యం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. వినాయక్ నగర్‌లో గల జ్యోతిబాపూలే విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కుల, వర్ణ, లింగ వివక్షతకు వ్యతిరేకంగా పోరాడిన మహెూన్నత వ్యక్తి పూలే అని అన్నారు. దళిత, గిరిజన, బహుజన వర్గాల అభివృద్ధికి కృషి చేశారని అన్నారు. నేటి పాలకులు కులాల, మతాల మధ్య చిచ్చుపెట్టి పబ్బం కడుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కే.భూమయ్య, సిపిఐ జిల్లా నాయకులు వై.ఓమయ్య, కే రాజన్న, రంజిత్, హనుమాన్లు, సాయిలు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ అధ్వర్యంలో....

ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో హనుమాన్ జంక్షన్ వద్ద పూలే విగ్రహానికి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఎడ్ల నాగరాజు, పూదరి గంగాధర్, కే.వేణుగోపాలరావు, మొయినుద్దీన్, మనోహర్, రాజ్ గగన్, శ్రీధర్, హరిబాబు, బంగారు సాయిలు, నవీన్, జిల్లా కాంగ్రెస్ నాయకులు, డిసిసి డెలిగేట్ రూపేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అధ్వర్యంలో....

జ్యోతిరావు పూలే చిత్రపటానికి పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు దేగాం యాదాగౌడ్ పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకుల స్వార్థం కోసం బడుగు బలహీన వర్గాలను వీడగొట్టి విభజించు, పాలించు మాదిరిగా పాలన వ్యవస్థ నడుస్తూ అగ్ర వర్ణ కులాలు రాజ్యమేలుతుందని అన్నారు. కార్యక్రమంలో వినోద్ కుమార్, ప్రతాప్ రెడ్డి, కొపేడి నర్సింలు, కళ్లెడ గంగాధర్,శంకర్ ముదిరాజ్, లవంగ రాజు,నర్సయ్య, ఫిరోజ్, బొబ్బ నర్సింహ, అశోక్, రఫీక్, వెంకటేష్, రవి, సుభాష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద మండల అంబెద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో పూజే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు సుంకరి విజయ్ మాట్లాడుతూ భారత దేశంలో మొట్టమొదటి సరిగా మహిళలకు, అణగారిన వర్గాలకు విద్యను అందించి వారి కోసం ప్రత్యేకంగా పాఠశాలలు స్థాపించి దేశంలో సామాజిక విద్య విప్లవానికి కృషి చేసిన మహనీయులు, సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతిబాపులే అన్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని, ఆయన అడుగుజాడల్లో నడిచి సమసమాజ స్థాపనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు పాలేపు నర్సయ్య, మండల నాయకులు, లెక్చరర్ సాయన్న, పాలేపు రవి కిరణ్, బాబురావు, గంగాధర్, లక్ష్మణ్, సాగర్ పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి:హసకొత్తూర్ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ఏనుగు పద్మ రాజేశ్వర్, బషీరాబాద్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సక్కారం అశోక్ జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఏనుగు రాజేశ్వర్, పంచాయతీ కార్యదర్శి నర్సయ్య, వార్డు సభ్యులు బషీరాబాద్‌లో ఉప సర్పంచ్ విక్రమ్, జిపి కార్యదర్శి శ్రీనివాస్, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

నవీపేట్:ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జ్యోతి బాపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నాయక్ వాడి శ్రీనివాస్ మాట్లాడుతూ సంఘ సంస్కర్తగా అణగారిన వర్గాలకు సేవలు అందించిన మహెూన్నత వ్యక్తి జ్యోతిబాపూలే అని అన్నారు. కార్యక్రమంలో జేబీవీ హెల్త్ కన్వీనర్ రాజశేఖర్, రైతు నాయకులు కిషన్, మంత గంగాధర్, దగడ్ సురేష్, జర్నలిస్ట్ శరత్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలకు రంజాన్ కానుకలు

నవతెలంగాణ-బోధన్

రంజాన్ పండగను పురస్కరించుకుని బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి రంజాన్ కానుకలను నాయకుల ద్వారా సరఫరా చేశారు. ఈ సందర్భంగా సాలూర, బోధన్ మండలాల్లో నిరుపేద ముస్లింలకు బోధన్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సాలురా షకీల్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో యువజన మండల ప్రధాన కార్యదర్శి షేక్ మజార్ అలీ, అజీజ్ భాయ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యా వైద్యానికి దూరం కాకూడదు

- నైన్ స్టార్ అధినేత పైడి రాకేష్ రెడ్డి



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న రాకేష్‌రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

విద్య, వైద్యానికి ఎవరు దూరం కాకూడదు అని నైన్ స్టార్ అధినేత పైడి రాకేష్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని బాగులింగంపల్లిలో మంగళవారం ఒక్క రూపాయికే డాక్టర్ కాన్సల్టేషన్‌తో నైన్‌స్టార్ హెల్త్‌కేర్-జిజి చారిటీ ఆస్పత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను సంపాదించిన దాంట్లో కొంత పేదవారికి సహాయం చేయాలని ఈ ఫౌండేషన్ ఏర్పాటు చేశామని, తనలాగా ఇతరులు కూడా ముందుకు రావాలని కోరారు. అన్ని సదుపాయాలతో ఆస్పత్రి నిర్మించామని అన్నారు. ప్రజలకు విద్య, వైద్యం ఉద్యోగాలు అందించి సహాయంగా ఉండాలని ఆయన కోరారు. ప్రజలందరూ రూపాయ కన్సల్టేషన్‌తో వైద్యాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ పైడి సుచరిత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జార్జిరెడ్డి వర్దంతి పోస్టర్ల ఆవిష్కరణ



నిజామాబాద్‌సిటీ :పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్/నిజామాబాద్‌సిటీ

ప్రగతిశీల ప్రజా స్వామ్యం విద్యార్థి సంఘం వ్యవస్థాపకులు, ఉస్మా నియా యూనివర్సిటీ అరుణతార, ఇండియా చేగువేరా, కామ్రేడ్ జార్జ్ రెడ్డి 51వ వర్ధంతి సభలను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలో మంగళవారం ట్రైబల్ వెల్ఫేర్‌లో పోస్టర్లు అవిష్కరించారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షులు ప్రిన్స్ మాట్లాడుతూ జార్జ్ రెడ్డి ఉద్యమ స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యా వ్యతిరేక విధానాలు, నూతన జాతీయ విద్యావిధానం-2020కు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు నిశాంత్, వెంకటేష్, నిఖిల్, అక్షయ్, రిషి, మధు తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్‌సిటీ :జార్జిరెడ్డి ఉద్యమస్ఫూర్తితో కేంద్ర రాష్ట్ర, ప్రభుత్వాలు ఆలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన జన్నారపు రాజేశ్వర్ పిలుపునిచ్చారు. జీజీ కాలేజ్ హాస్టల్ వద్ద జార్జిరెడ్డి వర్ధంతి పోస్టర్లు ఆవిష్కరించారు. జన్నారపు రాజేశ్వర్ మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు యూనివర్సిటీ విద్యను దూరం చేయడానికి నూతన విద్యా విధానం-2020 తీసుకువచ్చారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మనోజ్, భుజేందర్, సందీప్, నితీష్ ప్రవీణ్, జీవన్, వర్ధన్, రాజు, సాయిరాం, కపిల్ పాల్గొన్నారు.

జార్జి రెడ్డి వర్ధంతిసభ పోస్టర్‌ను గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్క గణేష్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్మోహన్ రావు, ఎగ్జామినేషన్ ఇంఛార్జి బరత్వరాజ్, లెక్చరర్స్ పద్మ, విజయ, అభి, వాని, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా రైతు సంఘం ఆవిర్భావ దినోత్సవం

నవతెలంగాణ-నవీపేట్



జెండా ఎగురవేస్తున్న నాయకులు

రైతు కూలీ సంఘం (ఏఐకేఎస్) 88వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు దేవేందర్ సింగ్ జెండాను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1935 ఏప్రిల్ 11న తెలంగాణ రైతు సంఘం ఆవిర్భవించిందని అన్నారు. రైతాంగ సమస్యలపై నిరంతర పోరాటం చేస్తుందన్నారు. మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన రైతు వ్యతిరేక చట్టాలపై 14 నెలల పాటు దేశ రాజధానిలో చేసిన పోరాటంతో కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చి చట్టాలను వెనక్కి తీసుకోవాల్సి వచ్చిందన్నారు. సుమారు 750 మంది రైతులు మృతి చెందిన విషయాన్ని గుర్తు చేశారు. ఎంఎస్‌పీ ధరలకు ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, 50 సంవత్సరాలు దాటిన ప్రతి రైతుకు ఐదువేల రూపాయల పెన్షన్ ఇవ్వాలని, ప్రధానమంత్రి కిసాన్ నిధి 18 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రతి ఒక్క రైతు రైతు సంఘంలో చేరాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు రామ్ సింగ్ నాయక్, నాయకులు మంత గంగాధర్, కిషన్, మెగావత్ గోవింద్, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలే భవిష్యత్‌కు ప్రగతి బాటలు

- ప్రొఫెసర్ ఎం.యాదగిరి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

'ఆన్ సైట్ రీసెర్చ్ మెథడాలజీ కోర్స్ పర్ పీహెచ్డీ స్టూడెంట్స్, యంగ్ ఫ్యాకల్టీ ఇన్ సోషల్ సైన్స్' పై రెండవ రోజు మంగళవారం స్పెషల్‌లో పరిశోధన పద్ధతులను ప్రొఫెసర్ డాక్టర్ ఎం.యాదగిరి బోధించారు. పరిశోధనలు భావి తరాలకుదారులు వేస్తాయన్నారు. పరిశోధన ప్రజల అవసరాలకు అనుగుణంగా ఉండాలని సూచించారు. సైన్సు పరిశోధనల ఫలితాలు స్థిరంగా ఉండగా సామాజిక శాస్త్రాల పరిశోధనల ఫలితాలు చలన స్థితిలో ఉంటాయన్నారు. ప్రొఫెసర్ జి రాంబాబు సరియైన పరిశోధనకు సరైన శాంపిల్స్ ఎంచుకున్నప్పుడే సాధ్యపడుతుందని వివరించారు. ప్రొఫెసర్ ఆంజనేయులు పరిశోధనలో సాహిత్యం ప్రాధాన్యతను వివరించారు. అనేక అధ్యయనాల తర్వాత పరిశోధన ఫలితాలను రాబడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో -కోఆర్డినేటర్ డాక్టర్ ఏ,పున్నయ్య, చైర్మన్ బిఓ స్ సమన్వయం చేశారు. 60 మంది స్కాలర్సు, యువ ఫ్యాకల్టీ మెంబర్స్ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. రిసోర్స్ పర్సన్స్‌ను సత్కరించారు.

సద్దుమణిగిన వివాదం

- పోలీసుల తీరుపై గ్రామస్తుల హర్షం



సీఐ ఆధ్వర్యంలో ఒక్కటైన ముస్లింలు

నవతెలంగాణ-ముప్కాల్

గత కొన్ని రోజుల నుంచి కొనసాగుతున్న ముప్కాల్ ముస్లిం సోదరుల సమస్యను మంగళవారం సీఐ గోవర్ధన్ రెడ్డి, బాల్కొండ ఎస్ఐ గోపి సమక్షంలో పరిష్కరించారు. మండల కేంద్రంలో ముస్లిం సోదరులు చిన్నచిన్న కారణాలతో రెండు వర్గాల వారీగా విడిపోయి ఒకరినొకరు దూషించుకునే స్థాయికి చేరుకుంది., ఒక వర్గం వారు మరో వర్గంపై పోలీసు స్టేషన్లో ఫిర్యాదులు చేసుకునే దిశగా గొడవలు ప్రారంభమయ్యాయి. ఈ దశలో సీఐ గోవర్ధన్ రెడ్డి, ఎస్ఐ గోపిలు ఇరువర్గాల వారిని పిలిచి సమస్యను పరిష్కరించారు. రెండు వర్గాలుగా విడిపోయిన వారిని ఒకటిగా కలిపారు. ముస్లిం సోదరుల మధ్య నెలకొన్న సమస్యలను పోలీసులు పరిష్కరించడం పట్ల మండల కేంద్ర వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

స్పందించకపోతే 17 నుంచి సమ్మె

- రాష్ట్ర జేపీసీ చైర్మన్ సాయిబాబా

నవతెలంగాణ-డిచ్‌పల్లి



మాట్లాడుతున్న రాష్ట్ర జేఏసి చైర్మన్ సాయిబాబ

ఈనెల 16వరకు విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకపోతే 17నుండి సమ్మె తప్పదని రాష్ట్ర జేఏసీ చైర్మన్ సాయిబాబా అన్నారు. మంగళవారం మండలంలోని ధర్మారం బిలో నిర్వహించిన నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లాల బహిరంగ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర జేఏసీ చైర్మన్ సాయిబాబా మాట్లాడుతూ.. విద్యుత్ ఉద్యోగుల పీఆర్సి గత సంవత్సర కాలంగా బకాయి పడిందని, మరి ట్రాన్స్‌కోకు సీఎం విన్నపం మేరకు ఇన్ని రోజులు వేచి చూశామని, ఇప్పుడు ఈనెల 17 నుంచి చేపట్టే సమ్మె నోటీసు ఇవ్వడం జరిగిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడానికి ప్రతి కార్మికుడు, విద్యుత్ ఉద్యోగులు కష్టపడి వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరవరా అందిస్తున్నామని తెలిపారు. సిఎండి ప్రభాకర్ రావు, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి, రాష్ట్ర ముఖ్యమంత్రి వద్దకు వెళ్లి పిఆర్సి 2022, ఈపీఎఫ్ టు జిపిఎఫ్, ఆర్టిజెన్స్ సమస్యలపై తక్షణమే ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర జేఏసీ కన్వీనర్ రత్నాకర్ రావు మాట్లాడుతూ... ఈనెల 16 లోపు పిఆర్సి ని ప్రకటించకపోతే సమ్మె లోకి వెళ్లడం ఖాయ మని అన్నారు. దీనికి పూర్తి బాధ్యత మేనేజ్మెంట్ వ్యవహరించాల్సి ఉంటుందని తెలిపారు. రాష్ట్ర చైర్మన్ శ్రీధర్ మాట్లాడుతూ పీఆర్సి ఆలస్యం అయిందని దీనికి మేనేజ్మెంట్ పూర్తి బాధ్యత వహించాల్సిన అవసరం ఉందని హెచ్చరించారు. ముఖ్యఅతిథులు కో కన్వీనర్ పి.శ్రీనివాస్, సదానందం, వెంకటేశ్వర్లు, అంజయ్య, వేణులకు జిల్లా జెఏసి చైర్మన్ రఘునందన్ స్వాగతం పలికారు. కార్యక్రమంలో కన్వీనర్ బాలేష్ కుమార్, కో చైర్మన్ పి.గంగాధర్, కో కన్వీనర్ తోట రాజశేఖర్, జిల్లా జైఎసి నాయకులు కాశీనాథ్, జి.శ్రీనివాస్, ఆర్.నాంపల్లి, గంగారాం, సురేష్ కుమార్, రాజేందర్, శ్రీనివాస్, ఎల్.శ్యామ్, బాబా శ్రీనివాస్, ఆర్.సునీత, ఉమా రాణి, కామారెడ్డి జిల్లా జేఏసీ చైర్మన్ బ్రహ్మం, నందకుమార్, ప్రదీప్, సంపత్ రెడ్డి దాదాపు రెండువేలమంది కార్మికులు ఉద్యోగులు అకౌంట్, ఇంజనీర్లు, అర్టిజన్లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌వి ఆత్మవంచన సమ్మేళనాలు

- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి

నవతెలంగాణ-వేల్పూర్(కంఠేశ్వర్)

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేస్తున్నది ఆత్మీయ సమ్మేళనాలు కాదని, అవి ఆత్మవంచన సమ్మేళనాలని నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి తెలిపారు. మంగళవారం వేల్పూర్ మండల మండలం అమీనాపూర్ గ్రామంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు నర్సారెడ్డి ఆధ్వర్యంలో హాత్ సే హాత్ జోడో కార్యక్రమం వేల్పూర్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మానాల మోహన్ రెడ్డి హాజరై ఇంటింటికి వెళ్లి రాహుల్ గాంధీ సందేశ కరపత్రాలు పంపిణీ చేశారు. ఉపాధి కూలీలను కలిసి ముచ్చటించారు. మానాల మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను మరిచి ప్రజలను వంచిస్తున్నాయన్నారు. నరేంద్ర మోడీ, కేసీఆర్ జీవన ప్రమాణాలను ఇబ్బందికర పరిస్థితులకు నెట్టివేస్తూ నిత్యాసరాల ధరలు, కరెంట్ బిల్లు, ఆర్టిసి చార్జీలు, గ్యాస్ సిలిండర్ ధరలన్నింటినీ ఆకాశాన్ని అంటిస్తున్నా రన్నారు. మందుల మీద, చివరకు మహిళలు పెట్టుకునే కుంకుమపైన నరేంద్రమోడీ 18శాతం జిఎస్టి వేస్తున్నారన్నారు. మహిళలకు రుణాలపై వడ్డీలు ఇవ్వకుండా కేసీఆర్ ఇబ్బంది పెడుతున్నారని దుయ్యబట్టారు. నిన్నటి వరకు కార్యకర్తల మొహం కూడా చూడని ఎమ్మెల్యేలు ప్రజలు బీఆర్ఎస్ ప్రభుత్వంపై చూపుతున్న వ్యతిరేకతను గుర్తించి కార్యకర్తలను ఆత్మీయ సమ్మేళనం పేరుతో కలుస్తున్నారని ఎద్దేవా చేశారు. రాబోయే కాలంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే గ్యాస్ సిలిండర్లు 500 రూపాయలకు, ఇల్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకోవడానికి 5 లక్షల రూపాయలు, రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ, ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నీరడి భాగ్య, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు వేణు రాజ్, ఇంద్ర గౌడ్, స్వరూప, బాజన్న, కుక్కుర్ రవి, మోహన్, జాను, రాజేందర్ ,మల్లేష్, గంగన్న, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కరపత్రాలు పంచుతున్న మానాల మోహన్‌రెడ్డి

పాము కాటుతో గిరిజన మహిళ మృతి



నవతెలంగాణ-పిట్లం

పాము కాటుకు ఓ గిరిజన మహిళ మృతి చెందిన ఘటన గద్దె గుండు తండాలో చోటు చేసుకుంది. తాండవాసుల కథనం మేరకు మండలంలోని గద్దె గుండు తాండకు చెందిన దేగవత్ స్వరూప (26) ఆదివారం రాత్రి తన ఇంట్లో నిద్రిస్తుండగా రాత్రి సమయంలో పాము ఆమె చేతికి కాటు వేసింది. దీంతో కుటుంబీకులు అప్రమత్తమై వెంటనే పిట్లం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ సరైన సదుపాయాలు లేకపోవడంతో వారు బాన్సువాడ ఏరియా ఆసుపత్రి తరలించారు. అక్కడి నుంచి జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యమంలోనే మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పది పరీక్షలు

నవతెలంగాణ-ఎడపల్లి



ఈ నెల 3న ప్రారంభమైన పదవ తరగతి వార్షిక పరీక్షలు మంగళవారంతో ప్రశాంతంగా ముగిశాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటన జరగకుండా ఎడపల్లి ఎస్ఐ పాండేరావు పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేశారు. చివరి రోజు పరీక్షలు రాసిన విద్యార్థులు పరీక్ష అనంతరం తమ సంతోషాన్ని స్నేహితులతో పంచుకున్నారు. పదో తరగతిలో 100శాతం ఉత్తీర్ణత సాధిస్తామని విజయ సంకేతం చూపించారు.

బాలికలను తప్పనిసరిగా డిగ్రీ వరకు చదివించాలి

- జ్యోతిరావు పూలే జయంతి వేడుకల్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్



జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, తదితరులు

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్

బాలికలను తప్పనిసరిగా డిగ్రీ వరకు చదివించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం ఆవరణలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడారు. బాలికలను చదివించవలసిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని తెలిపారు. ఆస్తుల కన్నా ముఖ్యమైనది చదవని గుర్తించాలని చెప్పారు. మహిళల విద్యాభివృద్ధి కోసం కృషి చేసిన గొప్ప సంఘసంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే అని కొనియాడారు. ఉన్నత చదువులు చదివిన వ్యక్తులు సమాజానికి సేవ చేసే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాన్సువాడ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థులు, కామారెడ్డి జ్యోతిబా పూలే జూనియర్ కళాశాల విద్యార్థులు చేపట్టిన సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జిల్లా తెలంగాణ సాంస్కృతి సారథి కళాకారులు మహనీయుల త్యాగాలను వివరిస్తూ పాటలు పాడారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉన్న జ్యోతి రావు పూలే విగ్రహానికి జిల్లా కలెక్టర్, టీఎన్జీవోఎస్, బహుజన సంఘాల ప్రతినిధులు, పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమావేశంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి శ్రీనివాస్, బీబీపేట ఎంపీపీ బాలమణి, దోమకొండ జడ్పీటిసి సభ్యుడు తిరుమల్ గౌడ్, బహుజన సంఘాల ప్రతినిధులు సిద్ధి రాములు, బలరాం, విజయ్ కుమార్, సంపత్, రాజయ్య, శ్రీకాంత్, రాజీవ్ కుమార్, నాగరాజు, నాగభూషణం పాల్గొన్నారు.

రేపు దోమకొండలో ప్రభుత్వ విప్ పర్యటన

నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అనంతరం దోమకొండలో నూతనంగా నిర్మించిన అంబేద్కర్ విగ్రహం, దొడ్డి కొమురయ్య విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ గురువారం ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్టు బీఆర్ఎస్ మండలాధ్యక్షులు మధుసుధన్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

బ్యాక్టీరియాతో కలిగే ఉపయోగాలను తెలుసుకోవాలి

- మండల వ్యవసాయ అధికారి నరేష్

నవతెలంగాణ-గాంధారి

బ్యాక్టీరియాతో కలిగే ఉపయోగాలను తెలుసుకోవాలని మండల వ్యవసాయ అధికారి నరేష్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గౌరారం, వెంకటాపుర్, మొండిసడక్, ముదోలి గ్రామాల పరిధిలోని వరి పొలాలను మండల వ్యవసాయ అధికారి నరేష్ పరిశీలించారు. అదే విధంగా భాస్వరం కరిగించే బ్యాక్టీరియా (పీఎస్‌బీ)ను వాడిన వరి పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాధ బలరాం, రైతుబంధు మండల అధ్యక్షులు మనోహర్‌రావు, వెంకటాపుర్ సర్పంచ్ మహేష్, వెంకటాపుర్ రైతుబంధు గ్రామ అధ్యక్షులు బలరామ్ నాయక్, ముదోలి రైతు బంధు గ్రామ అధ్యక్షులు రామ్ చందర్‌రావు, ఏఈఓ దీక్షిత్ పాల్గొన్నారు.

లింగంపేట్‌లో రేణుక ఎల్లమ్మ బోనాలు

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ బోనాలను నిర్వహించారు. ఇంటింటికీ బోనాలు అలంకరించి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. కార్యక్రమంలో రేణుక ఎల్లమ్మ ఆలయ కమిటీ సభ్యులు, గౌడ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ 7వ అఖిల భారత మహాసభల పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-బోధన్

ఐఎఫ్‌టీయూ 7వ అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ బోధన్ పట్టణంలోని తట్టికోటలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కోశాధికారి పోశెట్టి మాట్లాడుతూ.. ఈ నెల 16, 17, 18 తేదీలలో భారత కార్మిక సంఘాల సమాఖ్య జాతీయ 7వ మహాసభలు ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి పట్టణంలో జరుగుతాయని, కావున అన్నివర్గాల కార్మికులు పాల్గొని ఈ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ జాతీయ మహాసభలలో అన్ని రాష్ట్రాల నుంచి వేలాదిమంది కార్మికులు హాజరవుతారని, మొదటి రోజైన 16వ తేదీన భారీ కార్మిక ప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. ఈ బహిరంగ సభలో జాతీయ నాయకులు డాక్టర్ అపర్ణ, బి.ప్రదీప్, పి.ప్రసాద్ తదితర జాతీయస్థాయి నాయకులు పాల్గొంటారని, ఈ మహాసభలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. తెలంగాణ ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఉమా, పద్మ, విజయ, లక్ష్మి, రామ, పద్మ, భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండల కేంద్రంలోని జాతీయ రహదారి అండర్ బ్రిడ్జ్ వద్ద ఎస్టీఎఫ్ ఆధ్వర్యంలో దాడులు చేసి అక్రమ రవాణా చేస్తున్న 69.9 కిలోల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ సత్యనారాయణ తెలిపారు. దీని విలువ సుమారు రూ.7లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. గంజాయి రవాణా చేస్తున్నారన్న పక్కా సమాచారం మేరకు దాడులు చేశామని, ఇందులో ఇద్దరు పరారీలో ఉండగా పోచారం తండాకు చెందిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.



పట్టుకున్న గంజాయితో అధికారులు

ప్రతి గింజనూ కొనుగోలు చేయాలి

- పలుచోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నవతెలంగాణ-విలేకరుల బృందం

రైతుల ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేయాలని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు సూచించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మంగళవారం పలుచోట్ల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.

రైతన్నకు వెన్నుదన్నుగా ముఖ్యమంత్రి కేసీఆర్..

మద్నూర్ : ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారని జుక్కల్ ఎమ్మెల్యే హనుమంతు షిండే తెలిపారు. వ్యవసాయ రంగం అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి నిరంతరం కృషి చేస్తున్నారని వివరించారు. డోంగ్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో కుర్లా గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జుక్కల్ ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డీసీసీబీ డైరెక్టర్ రమేష్ పాటిల్, అడిషనల్ కలెక్టర్ చంద్ర మోహన్, బాన్సువాడ ఆర్డీవో రాజేశ్వర్‌గౌడ్, కామారెడ్డి డీసీఓ వసంత, మానిటరింగ్ ఆఫీసర్ అలీం, డోంగ్లి తహసీల్దార్ క్రాంతి కుమార్, ఎంపీడీవో, మండల వ్యవసాయ అధికారి రాజు, వ్యవసాయ విస్తీర్ణ అధికారి సమ్రిన్ అంజుం, డోంగ్లి బీఆర్ఎస్ మండలాధ్యక్షులు శశాంక్ పాటిల్, ఉపాధ్యక్షులు ఆనంద్ పాటిల్, సహకార సంఘం ఉపాధ్యక్షులు విజయ్ వర్శిండే, డైరెక్టర్లు అనంతరావు పాటిల్, అశోక్ పటేల్, సంగ్రామ్, నీలకంట్ రావు పాటిల్, ఉప సర్పంచ్ దబ్దే అశోక్, అధ్యక్షులు రాజు పటేల్, వెంకట్రావు పటేల్, ఎంపీటీసీ బచావార్ సుభాష్, డోంగ్లి సింగిల్ విండో కార్యదర్శి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

వర్ని : రైతులకు సకాలంలో వరి పంటకు మద్దతు ధరను ప్రకటించి కొనుగోలు కేంద్రాలను ప్రతి చోట ఏర్పాటు చేస్తున్నామని బాన్సువాడ నియోజకవర్గ యువనేత పోచారం సురేందర్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి మండలంలోని చందూర్, అక్బర్‌నగర్, గోవూర్ పీఏసీఎస్ చైర్మన్ లైన ప్యారం అశోక్ సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బాన్సువాడ నియోజకవర్గంలోనే



వర్ని : మాట్లాడుతున్న పోచారం సురేందర్‌రెడ్డి

వరి పంటలు ముందస్తుగా వేయడంతో ముందుగానే పంట చేతికి వస్తుందని, ఈ విషయాన్ని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి గమనించి ముందస్తుగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయించారని తెలిపారు. అన్ని సొసైటీల అధ్యక్షులు, పాలకవర్గ సభ్యులు రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వరి ధాన్యాన్ని ఆన్లైన్లో నమోదు చేసేలా చూడాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో నమోదు కాగానే రైతు ఖాతాలో నేరుగా డబ్బులు జమ అవుతాయని తెలిపారు. ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాకు రూ.2060, బీ గ్రేడ్ ధాన్యానికి రూ.2040 ప్రభుత్వం ధర ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి మండల ఏఎంసీ చైర్మన్ మూడ్ కవిత అంబర్ సింగ్, చందూర్ పీఎస్ఎస్ చైర్మన్ ప్యారం అశోక్, వైస్ చైర్మన్ తారాచంద్, మాజీ చైర్మన్ మాధవరెడ్డి, సర్పంచులు సాయిరెడ్డి, దేవిసింగ్, రవి, సీనియర్ నాయకులు రికెల సాయిరెడ్డి, రాంరెడ్డి, ఉప సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్, అక్బర్‌నగర్ సర్పంచ్ గంగామని వరప్రసాద్, గోవూర్ పీఏసీఎస్ చైర్మన్ సుధాకర్ రెడ్డి, ఎంపీపీ ఉమా శ్రీరాములు, సర్పంచ్ నరేందర్‌రెడ్డి, పలు మండలాల ప్రజాప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నసురుల్లాబాద్ : బీర్కూర్ మండలం బైరాపూర్ గ్రామంలో సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ రఘు, మాజీ జెడ్పీటీసీ సతీష్ మంగళ వారం ప్రారంభించారు. అనంతరం మాజీ జెడ్పీటీసీ సతీష్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు జరిపేందుకు పటిష్ట చర్యలు తీసుకుం టోందన్నారు. సహకార సంఘాల ద్వారా ధాన్యం కొనుగోల్లు చేపడుతుందని అన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం సూచించిన నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ ధాన్యం విక్రయాలకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షులు రామకృష్ణగౌడ్, సీఇఓ భూమయ్య రైతులు తదితరులు పాల్గొన్నారు.

బోధన్ : బోధన్ సొసైటీ ఆధ్వర్యంలో శ్రీనివాసనగర్‌లో సొసైటీ చైర్మెన్ ఉద్మీర్ లక్ష్మణ్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కోట గంగారెడ్డి, కోట గోపాల్‌రెడ్డి, సొసైటీ కార్యదర్శి ఉమాకాంతం, డైరెక్టర్లు పాల్గొన్నారు.



బోధన్ : ధాన్యం కొనుగోలు ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మెన్ ఉద్మీర్ లక్ష్మణ్



బోధన్ : కొనుగోలు ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మెన్ బ్రహ్మారెడ్డి

మినార్ పల్లి సొసైటీలో ధాన్యం కొనుగోలు ప్రారంభం..

మండలంలోని మినార్‌పల్లి సొసైటీలో సొసైటీ చైర్మెన్ మెట్ల రవీంద్రబాబు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి హనుమండ్లు, డైరెక్టర్లు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

భూ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారం

- బాన్సువాడ ఆర్డీఓ రాజాగౌడ్

నవతెలంగాణ-బిచ్కుంద

గ్రామాలలో నెలకొన్న భూ సమస్యలు రెవెన్యూ అధికారుల ద్వారా క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక తయారుచేసి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో పరిష్కరిస్తున్నట్టు బాన్సువాడ ఆర్డీవో రాజాగౌడ్ అన్నారు. మంగళవారం బిచ్కుంద మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీవో రాజాగౌడ్ సందర్శించారు. తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. మొక్కలు ఎండిపోకుండా కాపాడే బాధ్యత తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది చూసుకోవాలని అన్నారు. తహసీల్ కార్యాలయ గోడలు బీటలు వారి కూరుకుపోతున్నాయని గోడలు కూలిపోయే ప్రమాదం ఉందని కార్యాలయ సిబ్బంది ఆర్డీవో దృష్టికి తీసుకురాగా గతంలో రెండు మూడు సార్లు మరమ్మతులు చేపట్టడం జరిగిందని శాశ్వత పరిష్కారం కోసం సంబంధిత పంచాయతీరాజ్ ఏఈ ద్వారా ఎస్టిమేషన్ వేయించి మరమ్మతులు



మొక్కనాటుతున్న ఆర్డీఓ రాజాగౌడ్

చేయించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ఎంపీపీ అశోక్ పటేల్ ఆయా గ్రామాల సర్పంచులు గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలు ఆర్డీఓ దృష్టికి తీసుకురాగా రెవెన్యూ సిబ్బంది గ్రామాల్లోకి వెళ్లి క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి నివేదికలు తయారుచేసి తహసీల్దార్ కార్యాలయం ద్వారా ఆర్డీఓ కార్యాలయానికి అక్కడి నుంచి కలెక్టరేట్ కార్యాలయానికి పంపించి త్వరగా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని అన్నారు. ధరణి ద్వారా రైతులకు శాశ్వత పరిష్కారం జరిగిందని, కొన్ని దీర్ఘకాలిక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రభుత్వ అనుమతితో త్వరలోనే పరిష్కారం అవుతాయని ఈ సందర్భంగా ఆర్డీవో అన్నారు. ఇండ్లు నిర్మించుకునే వారికి ప్రభుత్వ పనుల కోసం మంజీర పరివాహక ప్రాంతం నుంచి ఇసుక రవాణాకు ముందుగా ఛాలాన్లు కట్టి తహసీల్ కార్యాలయంలో సమర్పించాలని ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణా కోసం వారికి అనుమతులు ఇవ్వనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ అశోక్ పటేల్, తహసీల్దార్ భరత్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాయిబాబా, సీనియర్ అసిస్టెంట్ శీతల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు వెంకటరావు దేశాయ్, ఎంపీటీసీ ఫోరం మండలాధ్యక్షులు సిద్దరం పటేల్, నాయకులు హనుమాన్లు, సంజు పటేల్, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

తెలంగాణ ఉద్యమకారుడికి దళిత రత్న అవార్డు

నవతెలంగాణ-బోధన్

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న బోధన్ పట్టణానికి చెందిన జేఏసీ శంకర్‌కు బాబు జగ్జీవన్ రాం జయంతి సందర్భంగా బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ నివాసంలో ఎమ్మెల్యే షకీల్ శంకర్‌కు దళితరత్న అవార్డును మంగళవారం అందించారు. సమాజ సేవలో ఉత్సాహంగా పాల్గొని సేవలందించే శంకర్ భవిష్యత్తులో మరిన్ని అవార్డులు అందుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం శంకర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు విద్యాసాగర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీందర్ యాదవ్, ఫ్లోర్ లీడర్ రాధాకృష్ణ, దూప్‌సింగ్, కొండ్ర వెంకటి, పాల్, నక్క లింగారెడ్డి, దళిత నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే షకీల్ నుంచి అవార్డు అందుకుంటున్న శంకర్

జ్యోతిబాపూలే ఆశయ సాధనకు పోరాడుదాం

- గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి మోతీరాం నాయక్
- ఘనంగా జ్యోతిబాపూలే జయంతి వేడుకలు
- నివాళులర్పించిన పలువురు

నవతెలంగాణ-విలేకరుల బృందం

లింగంపేట్ : జ్యోతిబాపూలే ఆశయ సాధన కోసం పోరాడాలని గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి మోతీరాం నాయక్ అన్నారు. మండల కేంద్రంలో జ్యోతిబాపూలే 197వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి జోహర్లు అర్పించారు. ఈ సందర్భంగా మోతి రామ్ నాయక్ మాట్లాడుతూ.. ఏమి తెలియని రోజుల్లో జ్యోతిబాపూలే ఆయన సతీమణి సావిత్రిబాయి పూలేతో సహా.. అట్టడుగు వర్గాల కోసం కృషి చేశారని తెలిపారు. వారి చదువు కోసం.. బ్రాహ్మణవాదాన్ని ఎదిరించి.. ప్రతి ఒక్కరి బాగోగుల కోసం కష్టపడ్డారని వివరించారు. అలాగే మనిషి హక్కుల కోసం అనేక కృషి చేసిన మహానుభావుడు అని తన ఆశయ సాధన కోసం నిరంతరం పోరాటంలో ఉండి కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ప్రకాష్ నాయక్, ఐద్వా జిల్లా కార్యదర్శి సావిత్రి, మండల నాయకులు రవి నాయక్, బలరాం, సిద్ధి రాములు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి మున్సిపల్ కేంద్రంలోని ఇంద్రా నగర్ కాలనీలో జ్యోతి బాపూలే జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా బహుజన నాయకులు మాట్లాడుతూ.. ఉద్యమాల సామాజిక కార్యక్రమాల వల్ల ప్రజలు ఆయనకు మహాత్మా అని పిలిచారని, భారతదేశంలో మొట్టమొదటిసారి మహిళల గురించి ఆలోచించిన సంఘసంస్కర్త, అలుపెరుగని పోరాట యోధుడు, జీవితం మొత్తం సమాజం కోసం గడిపిన మహనీయుడు అని కొనియాడారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి బహుజన సమాజ్ పార్టీ పట్టణ కమిటీ మర్లు సాయిబాబు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కంత్రి పద్మారావు, సంఘాని పోచయ్య, అంబేద్కర్ సంఘం నాయకులు రొడ్డ కాశీరాం, సంఘాని సాయిలు, సంఘాని బాలయ్య, కిషోర్, సత్తిగారి భూమయ్య, గుంటి గారి బాబు తదితరులు తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహాత్మా జ్యోతి బాపూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ కే ప్రవీణ్ కుమార్ అధ్యక్షత వహించారు. చరిత్ర అధ్యాపకులు అసిస్టెంట్ ప్రొఫెసర్ జయప్రకాష్ ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ 1 విభాగం తరపున బి.కృష్ణ ప్రసాద్, ఎన్ఎన్ ఎస్2 విభాగం తరపున గోదావరి విద్యార్థులకు, అధ్యాపక బృందానికి అరటి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఫరూద్ ఉద్దీన్, ప్రభాకర్‌రావు, గంగారెడ్డి, సిద్ధు రాజు, కృష్ణ ప్రసాద్ వినయకుమార్, చంద్రకాంత, మోహిన్ తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి : మండలంలో ఎంఎస్పీ జిల్లా కోఆర్డినేటర్ డల్లా సురేష్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారుల ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

పిట్లం : బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో జయంతివేడుకలు నిర్వహించారు. మండలంలోని మద్దేల్ చెరువు గ్రామ పాఠశాలలో అంబేద్కర్ యువజన సంఘం, సోషల్ వర్క్ టీం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మహాత్మా జ్యోతిబాపూలే గొప్ప సామాజిక తత్వవేత్త, ఉద్యమకారుడు, సంఘసంస్కర్త, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాంతం తపన చెందిన వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు కుమ్మరి యాదగిరి, మండలాధ్యక్షుడు ఆకుల లక్ష్మణ్, విజయ్, లక్ష్మారెడ్డి, శపథంరెడ్డి, నర్సాగౌడ్, సన్నపుల మధు, మద్దేల్ చెరువు సర్పంచ్ పండిత్ రావు, నడిపి గంగారం, ఉపాధ్యాయ బృందం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



లింగంపేట్ : నివాళులర్పిస్తున్న గిరిజన సంఘం నాయకులు



ఎల్లారెడ్డిలో..

రామారెడ్డి : మండలంలోని ఉప్పల్వాయి గ్రామపంచాయతీలో మహాత్మా జ్యోతిబాపూలే 197వ జయంతి వేడుకలను నిర్వహించారు. సర్పంచ్ కొత్తొల్ల గంగారం ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రైతుబంధు మండల అధ్యక్షులు నారాయణరెడ్డి మాట్లాడుతూ.. మహిళలకు పాఠశాలలు ఏర్పాటు చేసి విద్యనందించి, పురుషులతో సమానంగా మహిళలు సమాజంలో ఎదగాలని కృషిచేసిన మహనీయుడు జ్యోతిబాపూలే అని కొనియాడారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సరస్వతి, పంచాయతీ కార్యదర్శి స్వర్ణలత, పాలకవర్గ సభ్యులు, వీడీసీ పాలకవర్గం, ముదిరాజ్ సంఘం సభ్యులు, గ్రామస్తులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

బోధన్ : బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి కృషిచేసిన, సమాజంలోని అసమానతలు తొలగించి, సమాజ చైతన్యకారకులైన మహాత్మా జ్యోతిబాపూలే జయంతి వేడుకలను బోధన్, సాలుర మండలాల్లో నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాజాపూర్ గ్రామంలో అంబేద్కర్ - పూలే యువజన సంఘం ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మందర్న, హూన్సా, సాలురా, సాలుర క్యాంప్ గ్రామాలలో ప్రజాప్రతినిధులు పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు నాగయ్య, గంగాధర్, పంచాయతీ కార్యదర్శులు ప్రవీణ్, సతీష్ నాయకులు పాల్గొన్నారు.



రామారెడ్డి : ఉప్పల్వాయిలో చిత్రపటానికి నివాళి..

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ



నవతెలంగాణ-మోర్తాడ్

మండలంలోని ఐదు గ్రామాల 24 మంది లబ్ధిదారులకు సీఎం సహాయక నిధి చెక్కులు మంజూరైనట్లు ఎంపీపీ శ్రీనివాస్ తెలిపారు. మండలకేంద్రంలో 24 మంది లబ్దిదారుల గాను 11 లక్షల 50 వేల రూపాయలు చెక్కుల మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పిటిసి రవి పార్టీ మండల అధ్యక్షుడు ఏలియా సర్పంచులు ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

సమ్మె సన్నాహక సమావేశానికి తరలిన విద్యుత్ కార్మికులు

నవతెలంగాణ-గాంధారి

టీఎస్‌పీఈ జేఏసీ తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల 17 నుంచి చేపట్టే సమ్మె సన్నాహక సమావేశాన్ని నిజామాబాద్‌లోని పీహెచ్ఆర్ ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధారి మండలం నుంచి పెద్దఎత్తున విద్యుత్ కార్మికులు తరలివెళ్లారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు వై.సంపత్‌రెడ్డి, నందకుమార్, బ్రమ్మం, ప్రదీప్, వెంకటేశం, మెహర్ బాబా, తిరుపతి గౌడ్, స్వామి, తిరుపతిరెడ్డి, కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్యకర్తలే బీఆర్ఎస్ పార్టీకి బలం

- ఆత్మీయ సమ్మేళనాలతో కార్యకర్తల్లో మరింత చైతన్యం
- దేశ చరిత్ర లో నిలిచేలా కేసీఆర్ పాలన
- ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్తా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్త

నవతెలంగాణ-కంఠేశ్వర్

కార్యకర్తలే బీఆర్ఎస్ పార్టీకి బలం అని, ఆత్మీయ సమ్మేళనాలతో కార్యకర్తల్లో మరింత చైతన్యం వచ్చిందని, దేశ చరిత్రలో నిలిచేలా కేసీఆర్ పాలన సాగుతుందని ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త అన్నారు. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే గణేష్ బిగాల 7,25,26,48, 49వ డివిజన్ల బి ఆర్ ఎస్ పార్టీ కార్యకర్తలతో కోటగల్లీ మార్కండేయ మందిరం వద్ద ఆత్మీయ సమ్మేళనం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బిగాల గణేష్‌గుప్త మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడ లేని విధంగా సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. గెలిపించినందుకు రుణం తీర్చుకునేందుకు తన కానుకగా వధువు-వరులకి కొత్త బట్టలు ఇస్తున్నానని తెలిపారు. హైదరాబాద్ రోడ్డు ఏ విదంగా ఉందో అదే విధంగా వర్ని రోడ్డు, ఆర్మూర్ రోడ్డు,బోధన్ రోడ్డు అభివృద్ధి చేశామని తెలిపారు. ప్రతి ఇంటికి మంచి నీరు అందిస్తున్నామని, ఆధ్యాత్మిక శోభని వైభవాన్ని చాటేందుకి దేవాలయాల అభివృద్ధి కృషి చేస్తున్నాము.25 లక్షల రూ. లతో కోటగల్లీ లో మార్కండేయ మందిరం, .హమాల్ వాడి సాయి బాబా సంతోషి మాత ఆలయం పునర్నిర్మాణానికి 50 లక్షల . మంజూరు చేశానని తెలిపారు. అయ్యప్ప స్వామి ఆలయం, విటలేశ్వర ఆలయానికి నిధులు మంజూరు చేశామని, పెద్దమ్మ తల్లి ఆలయానికి 50 లక్షల రూ.తో నిర్మిస్తున్నామని చెప్పారు. కరోనా కాలంలో ప్రాణాలు ఫణంగా పెట్టి పనిచేసిన మెడికల్ సిబ్బందికి క్షేత్ర స్థాయిలో పనిచేసిన సిబ్బందికి వారు పనిచేస్తున్న చోటునే భోజన వసతి కల్పించానని గుర్తుచేశారు. .అన్ని కులాలు, మతాల వారు కలిసి ఉండాలని, అందరూ అభివృద్ధి చెందాలనేదే తన అభిమతం అని అన్నారు. కుల, మతాల మధ్య చిచ్చు పెట్టె వారి పట్ల మీ అందరూ జాగ్రత్తగా ఉండాలి.రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి-సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూ కిరణ్, నుడ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి టీఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్ష, కార్యదర్శులు సిర్ప రాజు- యెను గందుల మురళి, 7వ డివిజన్ ఇంచార్జీ కంచర్ల సంతోష్, 25వ డివిజన్ కార్పొరేటర్ సిరిగాదా ధర్మపురి, కో అప్షన్ సభ్యులు అంత రెడ్డి లత దేవి, డివిజన్ ఇంచార్జ్ చింతకాయల రాజు, సిరాజ్ పాషా, 26వ డివిజన్ ఇంచార్జ్ సిర్ప సువర్ణ రాజు, 48వ డివిజన్ ఇంచార్జ్ సామల ప్రసన్న సత్యపాల్, రేసు హనుమాండ్లు, 49వ డివిజన్ ఇంచార్జ్ అంకర్ మహేష్, మాజీ కార్పొరేటర్ ఉంద్రా చంద్ర భూషణ్, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని బస్వాపూర్ జీపీ గ్రామంలో జాతీయ ఉపాధిహామీ నిధులతో సీసీ రోడ్డు పనులను సర్పంచ్ రవిపటేల్, మాజీ విండో చైర్మన్ రాజు పటేల్‌తో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రవి మాట్లాడుతూ.. గ్రామంలో అత్యవసరంగా ఉన్న విధులను గుర్తించి ముందుగా సీసీ రోడ్డు వేసి ఒక్కొక్కటిగా సమస్యను పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్, మాజీ విండో చైర్మెన్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పనికి గైర్హాజరైతే హాజరు వేయొద్దు

- ఎంపీడీవో వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న ఎంపీడీవో

నవతెలంగాణ-పిట్లం

పనికి గైర్హాజరైన వారి హాజరు వేసి నష్టపోవద్దని ఎంపీడీవో వెంకటేశ్వర్లు కూలీలకు సూచించారు. సోమవారం మండలంలోని జగదాంబ తండాలో కొనసాగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ పనులలో ఆయా గ్రూపులలో సభ్యులు ఎవరైనా గైర్హాజరైతే వారికి హాజర్ వేస్తే గ్రూప్ అంతటికీ తక్కువ పేమెంట్ కావడంతో మిగతా సభ్యులకు నష్టం వాటిల్లుతుందని ఆయన సూచించారు. అందుకుగానూ హాజరైన కూలీలే వారి కొలతల ప్రకారం పనులు చేసి లబ్ధిపొందాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఉపాధిహామీ ఏపీవో శివకుమార్, టెక్నికల్ అసిస్టెంట్ తుకారం తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంవత్సరం ప్రారంభానికల్లా ఎకరూప దుస్తులు అందిస్తాం :ఎంఈఓ

నవతెలంగాణ-బోధన్

వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికల్లా విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందిస్తామని బోధన్ ఎంఈఓ నాగనాథ్ అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో సాలూర మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2023-24 సంవత్సరానికి గానూ విద్యార్థులకు ఏకరూప దుస్తుల బట్ట వచ్చిందని, పాఠశాలలు తెరిచేలోపు పాఠశాల యాజమాన్య కమిటీల ద్వారా ఏకరూప దుస్తులు సిద్ధం చేయించాలని సూచించారు. విద్యార్థుల నిర్మాణాత్మక మూల్యాంకనం, సంగ్రహణాత్మక మూల్యాంకనంలో గ్రేడుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి ప్రోగ్రెస్ కార్డులు విద్యార్థులకు పాఠశాల చివర రోజున అందించాలని అన్నారు. కార్యక్రమంలో మండల నోడల్ ఆఫీసర్ నాగయ్య, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరశర్మ, ఇల్తెపు శంకర్, వివిధ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని మహిళ మృతి

నవతెలంగాణ-ముప్కాల్

44వ జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని మహిళ మృతి చెందింది. పోలీసుల వివరాల ప్రకారం... ముప్కాల్ మండలం వేంపల్లి గ్రామ శివారు జాతీయ రహదారి బైపాస్ రోడ్డుపై సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని మహిళ (35) రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీ కొనడంతో ఘటన స్థలంలోనే మృతి చెందింది. మృతురాలు ఎవరనేది పోలీసులు ఆరాతీస్తున్నారు.

మందిర పునర్నిర్మాణ పనులు పరిశీలన

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త కోటగల్లీలోని 25 లక్షల రూ.లతో పునర్నిర్మిస్తున్న మార్కండేయ మందిరం పనులను మంగళవారం పరిశీలించారు. కార్యక్రమంలో నగర మేయర్ నీతూ కిరణ్, పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్ష-కార్యదర్శులు వెంకటనర్సయ్య, మురళి అధికారులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే జ్ఞాపకార్థం చలివేంద్రం ఏర్పాటు



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని ఏ సి పి కార్యాలయం టేకు మసీదు దగ్గర మంగళవారం బాల్కొండ మాజీ ఎమ్మెల్యే గడ్డం మధుసూదన్ రెడ్డి, వారి సతీమణి గడ్డం లక్ష్మీదేవిల జ్ఞాపకార్థం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఆయన కుమారుడు మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేసినట్టు వారి కుటుంబ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో జి నారాయణ రెడ్డి, జగత్ రెడ్డి, న్యాయవాదులు తులసీదాస్, జగన్ ,పిప్రి గంగారెడ్డి మంతిని గంగారం, పిప్రి గంగారెడ్డి ,చిట్టాపూర్ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు పాదరక్షలు పంపిణీ

నవతెలంగాణ-జుక్కల్

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న పేద విద్యార్థులకు పాదరక్షలు, షూష్‌ను పంపిణీ చేసినట్టు హెచ్‌ఎం బస్వంత్‌రావ్ పటేల్ తెలిపారు. మంగళవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పంపిణీ కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన ప్రయివేట్ మీడియా సంస్థ యజమాని రామచంద్రం, డి.కల్పన దంపతులు విరాళంగా పాఠశాలలోని పేద విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయ బృందం దాతలైన రామచంద్రం కల్పన దంపతులకు శాలువా పుష్పగుచ్ఛాలిచ్చి సత్కరించారు. కార్యక్రమంలో దాతలు, హెచ్‌ఎం, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కుస్తీ పోటీలు



బహుమతులు అందజేస్తున్న సర్పంచ్

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని మేడిపల్లి గ్రామంలో నిర్వహించిన కుస్తీ పోటీలు మండల ప్రజలను అమితంగా ఆకట్టుకున్నాయి. గ్రామంలో నిర్వహించిన కుస్తీ పోటీలు హోరాహోరీగా సాగాయి. మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోటీలు నిర్వహించారు. కొబ్బరికాయ కుస్తీ పోటీ మొదలుకొని వెండి కడియాల కుస్తీ వరకు నిర్వహించారు. కుస్తీ పోటీల్లో గెలుపొందిన మల్లయోధులకు సర్పంచ్ మల్లె బోయిన నారాయణ స్థానిక నాయకులతో కలిసి నగదు, వెండి కడియాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లెబోయిన నారాయణ, గ్రామ పెద్దలు నారాగౌడ్, శ్రీనివాస్, అజీమ్, షాబుద్దీన్, పిట్ల సురేష్, సాయిలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా నివాళి

నవతెలంగాణ-మోపాల్

మోపాల్ మండలంలోని ముదక్ పల్లి గ్రామంలో మంగళవారం బిజెపి పార్టీ ఆధ్వర్యంలో జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ ఘన నివాళులు అర్పించారు. అనంతరం పల్లె పల్లెకు బిజెపి ఇంటింటి కమలం పువ్వు లో భాగంగా బిజెపి అందించిన సంక్షేమ ఫలాల కరపత్రాలను మోపాల్ మండల అధ్యక్షుడు రవికుమార్ అధ్యక్షతన పంపిణీ చేశారు. గ్రామంలో శివాజీ విగ్రహం ఏర్పాటు చేయడం. గొప్ప కార్యక్రమని యెండల లక్ష్మీనారాయణ అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, కూచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, అంచ మహేందర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

దొంగతనాన్ని ఛేదించిన పోలీసులు

- వేలిముద్రల ఆధారంగా పట్టుబడిన వ్యక్తి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

నాగిరెడ్డిపేట్ మండలంలోని పెద్దా ఆత్మకూర్‌లో ఫిబ్రవరి నెలలో జరిగిన దొంగతనం కేసులో ఒకరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఫిబ్రవరి 28న పెద్ద ఆత్మకూర్‌లోని జూకంటి కోటి ఈశ్వరయ్య ఇంట్లో దొంగతనం జరిగింది. కాగా నాగిరెడ్డిపేట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేశారు. లభించిన వేలిముద్రలు కోడూరి సీతారాంతో పోలి ఉండటంతో అతనిని అదుపులోకి తీసుకుని విచారించగా అతడు గతంలో దుండిగల్ ఏరియాలో ముత్తూట్ ఫిన్‌కార్ప్‌లో దొంగతనం చేసినట్టు తెలిసింది. దర్యాప్తులో భాగంగా అతనిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. అతనిని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. అతని వద్ద నుంచి బంగారు, వెండి ఆభరణాలను, రూ.15వేల నగదు కలిపి మొత్తం రూ.1,28,839 విలువ గల సొత్తును రికవరీ చేశారు. ఈ కేసును ఛేదించిన ఎస్ఐ, సిబ్బందిని సీఐ శ్రీనివాస్ అభినందించారు.

మహిళలకు ఆరోగ్య పరీక్షలు



వైద్య పరీక్షలకు హాజరైన మహిళలు

నవతెలంగాణ-మెండోరా

రాష్ట్రంలోని ప్రతి మహిళా ఆరోగ్యంతో ఉండాలన్న ఉద్దేశ్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య మహిళ పథకాన్ని ప్రవేశపెట్టిందని ఎపియం జగదీష్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళ సంఘాల మహిళలకు మంగళవారం ప్రత్యేక ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటి డియం అండ్ హెచ్ఓ రమేష్ హాజరయ్యారు. మహిళలు ప్రధానంగా ఎదుర్కొనే ఎనిమిది రకాల ఆరోగ్య సమస్యలకు వైద్యం అందించడంకోసం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఎవరికైనా మెరుగైన వైద్యం అవసరమైతే రెఫర్ చేయడంద్వారా పెద్దాసుపత్రుల్లో వారికి సాయం చేసేందుకు ప్రత్యేక హెల్ప్ డెస్‌లు అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎం అండ్ హెచ్ ఓ రమేష్ , మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ప్రణవ , ఎపియం విక్రమ్ రెడ్డి , హెల్త్ స్టాఫ్ మరియు ఐకెపి సిబ్బంది , మహిళలు తదితరులు పాల్గొన్నారు.

16న ఆదర్శ పాఠశాల, కళాశాలల అడ్మిషన్‌కు పరీక్షలు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ఈనెల 16న తెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాల అడ్మిషన్స్‌కు పరీక్షలు నిర్వహిస్తున్నట్టు జక్రాన్‌పల్లి మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ రాజేష్‌రెడ్డి మంగళవారం తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఆరవ తరగతి నుంచి పదవ తరగతి వరకు వారి తల్లిదండ్రులు హాల్ టికెట్లు మీసేవ నుండి తీసుకోవాలని సూచించారు. ఆరవ తరగతి వారికి ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఏడవ తరగతి నుండి పదవ తరగతి వరకు మధ్యాహ్నం రెండు గంటల నుంచి నాలుగు గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. హాల్ టికెట్ డౌన్లోడ్ చేసుకునే వెబ్సైట్ telangana.m.s cgg.gov.in హాల్ టికెట్లు పొందాలని తెలిపారు.

రూరల్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా కళా శ్రీనివాస్



నియామకపత్రం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పూసల గల్లీలో గల బీఎస్పీ కార్యలయంలో బీఎస్పీ జిల్లా నాయకుల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఇటీవల బహుజన సమాజ్ పార్టీలో చేరిన కళా శ్రీనివాస్ కు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహతి రమేశ్ నిజామాబాద్ రూరల్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ గా బాధ్యతలు అప్పగిస్తూ నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి గైని గంగాధర్, జిల్లా ఉపాధ్యక్షులు సిలుమల గణేష్, ప్రధాన కార్యదర్శి పిట్ల శ్రీనివాస్, కార్యదర్శి ఎర్రోళ్ల గంగాధర్, జిల్లా కార్యదర్శులు సింగాడే పాండు, గురజాల హరీష్, కుప్పిరియాల రామచందర్, గండికోట రాజన్న, పోతే ప్రవీణ్, గుంటి బెనర్జీ, నట్ట అనంత్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి రూ.50 వేల విరాళం



విరాళం అందజేస్తున్న దాత

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి తనవంతుగా ఉప్లూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు, కమ్మర్ పల్లి సింగిల్ విండో చైర్మన్ రేగుంట దేవేందర్ రూ. 50 వేల విరాళం అందజేశారు. మంగళవారం విరాళం మొత్తాన్ని అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు లుక్కా గంగాధర్, కమ్మర్‌పల్లి గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బద్దం రాజేష్, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు బద్దం రాజశేఖర్, చింత గణేష్, తదితరులు పాల్గొన్నారు.

బషీరాబాద్, హసకొత్తూర్‌లలో ఘనంగా గంగమ్మ జాతర

- ఆలయాల వద్ద అన్నదానం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్, హస కొత్తూర్ గ్రామాల్లో గంగమ్మ జాతర ఉత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. బషీరాబాద్ గ్రామ శివారులోని కాడి చెరువులో ఉన్న గంగమ్మ దేవాలయం వద్ద జాతర మహోత్సవం సందర్భంగా సర్పంచ్ సక్కరం అశోక్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గంగమ్మ జాతరను పురస్కరించుకొని దేవాలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. హసకొత్తూర్‌లో శివ గంగమ్మ దేవాలయం ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని జాతర ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బషీరాబాద్ లో ఉప సర్పంచ్ విక్రమ్, వార్డు సభ్యులు సాగర్, గణేష్, నాయకులు ఎస్. రమేష్, టి. అప్పయ్య, ఆర్పీ. రాజు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

14న వ్యాసరచన, ఉపన్యాస పోటీలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఏప్రిల్ 14న డాక్టర్ బీఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా సుభాష్ నగర్‌లోని నెహ్రూ యువ కేంద్ర కార్యాలయంలో యువతీయువకులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహిస్తామని నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారిణి శైలి బెల్లాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14 న ఉదయం 10 గంటలకు పోటీలు ప్రారంభం అవుతాయని, పోటీలో 15 సంవత్సరాల నుండి 29 సంవత్సరాలుగల యువతి యువకులు వ్యాసరచన, ఉపన్యాసం తెలుగు, హిందీ, ఇంగ్లీష్ మూడు భాషలలో ఏదేని ఒక భాషలోనే పాల్గొనాలని పేర్కొన్నారు. అదే రోజే న్యాయనిర్ణేతలు విజేతలను ప్రకటించి బహుమతులు అందజేస్తారని తెలిపారు. పాల్గొన్న వారందరికీ ప్రశంసా పత్రాలు ప్రథమ, ద్వితీయ విజేతలకు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. పాల్గొనేవారు 9100435410 ఫోన్ నెంబర్ కు వాట్సాప్ ద్వారా ముందుగానే తమ పేరు, వివరాలు ఇచ్చి నమోదు చేసుకోవాలని తెలిపారు.

ఉపాధిహామీని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-రాజంపేట్

జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఉపాధి హామీని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో బాలకిషన్ అన్నారు. గ్రామీణ ఉపాధి హామీలో భాగంగా పొందుర్తి, ఆరేపల్లి గ్రామంలో నీటి కుంట, ఫార్మషన్ రోడ్డు పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. వేసవి ప్రారంభమవుతున్నందు వలన వ్యవసాయ పనులు తక్కువగా ఉంటాయని, కాబట్టి జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఉపాధి హామీని ఉపయోగించుకొని అధిక వేతనం పొందాలని లేబర్‌కు ఆయన సూచించారు. కొలతల ప్రకారం పేమెంట్ ఇస్తామని సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

16న మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు పరీక్ష

- హాల్ టికెట్స్ డౌన్‌లోడ్ చేసుకోవాలి

నవతెలంగాణ-సదాశివనగర్

ఏప్రిల్ 16న ఆదివారం మోడల్ స్కూల్ అడ్మిషన్ టెస్ట్ నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపల్ భాను మతి తెలిపారు. 6వ తరగతిలో ప్రవేశానికి ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు సంబంధిత వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్స్ డౌన్లోడ్ చేసుకొని పరీక్షకు హాజరు కావాలని కోరారు.